

ల్యాండ్ సర్వేకు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

ప్రజాశక్తి - అంబాజీపేట

ల్యాండ్ సర్వేకు రైతులందరూ సహకరించి తమ భూములు పరిరక్షించుకోవాలని కెఎస్ఎస్.రాష్ట్ర అధికార ప్రతినిధి పత్తి దత్తుడు, తహశీల్దార్ జె. వెంకటేశ్వరిలు మాచవరం పంచాయతీ సర్పంచ్ నాగాబత్తుల శాంతా కుమారి అధ్యక్షతన శుక్రవారం ల్యాండ్ సర్వే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 251.61 ఎకరాల విస్తీర్ణం ఉండగా దానిలో 32.721ల డ్రెయిన్, ప్రభుత్వ స్థలాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకటేశ్వరరావు, విఆర్ఓ వెంకట రమణ,గ్రామ పెద్దలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం..

- ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు
- ధరల తగ్గింపునకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - రాజోలు, అయినవిల్లి

నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యుడు భగ్గుమంటున్నాడు. కూరగాయల ధరలు పప్పులు, నూనెలు, బియ్యం ఇలా ఒక్కటేమిటీ దేనిని పట్టుకున్నా షాక్ కొట్టేలా పరిస్థితి ఉంది. పిల్లల చదువులు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇంటి కిరాయిలు ఇతర ఖర్చులకు అరకొర సంపాదించే సామాన్యుడి జీతం నెల తిరిగేసరికి ఆవిరైపోతోంది. ఇక దినసరి కూలీ సంగతి సరేసరి. నిత్యావసర సరుకులు పెరుగుదల పై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిగా సరుకుల ధరలు పెరిగిపో తున్నాయి. ఫలితంగా సామాన్యుడు పెరిగిన ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

తలకిందులవుతోన్న కుటుంబ బడ్జెట్

గత కొంతకాలంగా పెరిగిన ధరలు, ఇతర వ్యయాలతో కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది. ఇంటి కిరాయిలు, పాలు, చక్కెర, పప్పులు, బియ్యం, కూరగాయలు, ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యుల నోట మాట రావడం లేదు. ప్రస్తుతం లీటరు నూనె ప్యాకెట్ పై ఏకంగా రూ.20 నుంచి రూ. 45కు పెరిగింది. బియ్యం ధరలు క్వింటాల్ కు రూ.300 నుంచి రూ.500 పెరిగాయి. ఇక పప్పుల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సైతం పెరిగి పోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

పెరిగిన నిత్యావసర ధరలు ఇలా..

కిలో	రూపాయల్లో
సన్ ఫ్లవర్ ఆయిల్	రూ. 140
పామాయిల్	రూ. 120
కందిపప్పు	రూ.190
మినప్పప్పు	రూ.-160
చింతపండు	రూ.-140
వెల్లుల్లి కిలో	రూ.400
టమోట	రూ.80
ఉల్లిపాయలు	రూ.- 60
బంగాళదుంప	రూ.80
వంకాయ	రూ. 80
అల్లం	రూ.150
చిక్కుడు, క్యారెట్	రూ. 80


వివిధ నిత్యావసర సరుకులు


కూరగాయల దుకాణం

గడిచిన రెండు నెలల్లోనే..

గత రెండు నెలల నుండి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒకవైపు నిత్యావసర సరుకులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగి పోవడంతో ఏమి కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.2,050కి పైగానే పలుకుతోంది. వెల్లుల్లి ధర అసలు కిందకు దిగిరానంటోంది. ప్రస్తుతం కేజీ వెల్లుల్లి ధర రూ.320గా ఉంది. దీంతో సామాన్య ప్రజలు 'ఏమి కొనలేం.. ఏం తినలేం..' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణ దారులు నష్టపోతున్నారు. ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు, కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం

ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. గత వైసిపి ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేసింది.నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్డు దారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా బియ్యంతో సరిపెడుతోంది. కందిపప్పు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాపారం అంతంత మాత్రమే

ధరలు పెరిగిపోవడంతో ఆర్థాకలితో ఉంటున్నామని ఓ పక్క ప్రజలు అంటుంటే, మరో పక్క ధరలు పెరుగుదలతో వ్యాపారం లేదని షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణ దారులు నష్టపోతున్నారు ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు, కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి ఒక వేళ ఎవరైనా వచ్చినా అరకొరగా సరుకులు తీసుకెళ్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.అధిక ధరలకు కొని తెచ్చుకుంటున్నామని, పూర్తి స్థాయిలో కొనుగోళ్లు లేక సరుకు పాడవుతుందని, ఫలితంగా నష్టాలను చవిచూస్తున్నామని వారు వాపోతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమి కొనలేని, ఏమి తినలేని పరిస్థితి.. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- తాడి శ్రీరామమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు


సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

26న మహాధర్నా

జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు నవంబర్ 26నకలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు శుక్రవారం అమలాపురం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, ఎఐటియుసి నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి పూర్వ జిల్లా అధ్యక్షులు కె.సత్తిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు తదితరులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చిన తర్వాత రైతులు, కార్మికులు వ్యవసాయ కార్మికులు, దళితులు, బలహీన వర్గాల పైనా భారాల మోపిందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకి అనుకూలమైన విధానాలను అనుసరిస్తూ దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెడుతుందని ఈ దుర్మార్గమైన విధానాల్ని నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా అఖిలభారత కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ఈ మహా ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వివిధ ప్రజాసంఘాల నాయకులు పీతల రామచంద్రరావు, కె.సత్తిరాజు ఎం.భాస్కర్ రావు, బి.ఎస్తేరు రాణి, మలక సుభాషిణి, తాడి శ్రీరామ్ మూర్తి, పొలమూరి శ్రీనివాసరావు, ఊటాల వెంకటేష్, బి.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

కూనవరంలో శుక్రవారం జనసేన నాయకుడు ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి ప్రారంభించారు. అంబాజీపేటకు చెందిన లీజర్ రైట్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ముత్యాల రాజు,డాక్టర్ విఎస్ జోషిలు 120 మంది కంటి రోగులను పరీక్షించి ఉచితంగా మందుల అందజేశారు. 20 మందిని కంటి ఆపరేషన్ కొరకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో టిడిపి రామ కమిటీ అధ్యక్షులు ఆకుల రాము, నాయకులు వాకపల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి రాంబాబు, సుందరనీడి ఏసుబాబు, మారిశెట్టి బాబి, సుందరనీడి రాజబాబు, బసవా ప్రకాష్, ఆకుల సత్యనారాయణ, సుందరనీడి నరసబాబు తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఈశ్వరి

దొరబాబుకు మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి

ప్రజాశక్తి- మండపేట


దొరబాబు

మండపేట పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, టిడిపి ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మందపల్లి చంద్రశేఖర్(దొరబాబు)ను రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వరించింది. కార్పొరేషన్ డైరెక్టర్‌గా దొరబాబును ప్రభుత్వం నియమించింది. దొరబాబు ఆది నుంచి టిడిపిని అంటిపెట్టుకుని ఉన్నారు. ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు వీర విధేయుడు కావడంతో ఆయనకు డైరెక్టర్ పదవి దక్కింది. టిడిపి టౌన్ ప్రెసిడెంట్ ఉంగరాల రాంబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు దూలి జయరాజు, టిడిపి నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్‌కుమార్, పెందుర్తి కిషోర్ తదితరులు దొరబాబుకు అభినందనలు తెలిపిన వారిలో వున్నారు.

అంతర్వేదిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది సముద్ర తీరంలో శుక్రవారం పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా పలువురు యాత్రికులు సముద్రంలో స్నానాలు ఆచరించి ఒడ్డున కార్తీక దీపాలు వెలిగించారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పెద్దలు, చిన్నారులు సముద్రపు ఒడ్డున సహపంక్తి భోజనాలు చేసి సముద్రంలో స్నానాలు చేసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

కార్టూ'నిజం'



పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పలుచోట్ల గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు అంశాలపై వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు.

ముమ్మిడివరం: ప్రజా అవసరాలకు అనుగుణంగా గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవడం ఎంతో అవశ్యకమని జిల్లా పంచాయతీ అధికారిణి శాంత లక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం ఎంపిడిఒ టి.వెంకటాచార్య అధ్యక్షతన గ్రామాల అభివృద్ధి పై మండల స్థాయి అధికారులకు మరియు పంచాయితీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సి హెచ్.లక్ష్మీ కళ్యాణి, ఎఎన్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డిఇ పి.విజయ శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** గ్రామ పంచాయతీల్లో ప్రణాళికలు రూపొందించడం ద్వారానే గ్రామాల అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతా లక్ష్మి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ,పి ఆర్ సి రాజ్ కుమార్ అధ్యక్షతన పంచాయతీరాజ్,గ్రామీణ అభివద్ధి,పశుసంవర్ధక, వ్యవసాయ,వైద్య శాఖల అధికారులకు పంచాయతీ కార్యదర్శులకు పంచాయితీల అభివద్ధి ప్రణాళికపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో డి పి ఆర్ సి,ఎస్ ఎల్ వి భీమేశ్వరి, ఎంపిడిఒ కార్యాలయం పాలనాధికారి ఎం ఎల్ ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయితీ డెవలప్మెంట్ ప్లాన్, బ్లాక్ డెవలప్మెంట్ పంచాయతీ ప్లాన్లపై అవగాహన కలిగి ఉండాలని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ, ఇంచార్జ్ డిఎల్‌పిఒ ఐ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పై విభా గాలపై శుక్రవారం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎస్.లక్ష్మి లావణ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పి.పద్మావతి, వెటర్నరీ వైద్యులు వినోద్ కుమార్, ఎపిఎం ఎం.ధనరాజు, ఎపిఒ అరుణకుమారి, కార్యదర్శులు, వివిధ శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **అల్లవరం:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు, అమలు పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు అవగా హన, శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ ఆధ్వ ర్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి యు.నాగేంద్ర, ఎపిఎం సయాద్, పంచాయతీ కార్యదర్శులు రాజ్‌మోహన్, దుర్గాశ్రీను, శిరీష, వీరబాబు, జ్యోతి, డిజిటల్ అసిస్టెంట్లు, విఒలు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** గ్రామాలను అభివద్ధి చేసేందుకు ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలనే అంశాల పై మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎస్ వెంకటాచలం అధ్యక్షతన జిపి డిపి శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించినారు. ఈ శిక్షణ తరగతుల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ వన్ నుంచి గ్రేడ్ 6 కార్యదర్శులు, డ్వాక్రా యానిమేటర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి బి మమత, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు,మండల ఇంజినీరింగ్ అధికారి ఫకీర్, ఆర్‌డబ్ల్యు జెఇ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారిణి



ఆలమూరులో నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్తిబాబురాజు

అభినందనలు తెలిపిపన కూటమి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - అల్లవరం

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా దెందుకూరి సత్యనారాయణ రాజు(సత్తిబాబు రాజు) ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సత్తిబాబు రాజు టిడిపి అల్లవరం మండల అధ్యక్షులు అన్నారు. టిడిపి గ్రామస్థాయి నుంచి బలపోతం చేసి గత సార్వత్రిక ఎన్నికలలో టిడిపి గెలుపునకు కృషి చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయిన సత్తి బాబు రాజు అల్లవరం మండల నాయకులు, కార్య కర్తలు దుశ్శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. గోడి సర్పంచ్ తోట శ్రీదేవి, గొడితిప్ప సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, చింతా శ్రీను, తోట నరసింహం, కొల్లు విష్ణు మూర్తి, రోళ్ళ శ్రీను, రొక్కాల నాగేశ్వర రావు, మొసుగంటి దుర్గరావు, వీర మల్లు భీమేశ్వర స్వామి, మామిడిశెట్టి శ్రీరామ్ , కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభినందనలు తెలిపారు.


సత్తిబాబురాజుకు అల్లూరి సీతారామరాజు చిత్రపటం బహూకరణ

శుభాకాంక్షలు తెలిపిన సర్పంచులు

అమలాపురం రూరల్ : రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన అల్లవరం మండల టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ రాజు(సత్తిబాబురాజు)ను అమలాపురం నియోజకవర్గం సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు పెద్దిరెడ్డి రాము ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పెనుమాల సునీత, నాయకులు ఏడుకొండలు, వైదేహి సాయిరాం, ప్రసన్న ప్రవీణ్, పందిరి విజయ, నాయకులు శ్రీను, తోట శ్రీదేవి, నాయకులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


సత్తిబాబురాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచులు

48 గంటల్లోగా ధాన్యం సొమ్ము జమ

జెసి టి. నిషాంతి

ప్రజాశక్తి - అమలాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము నిధులు రైతు బ్యాంకు ఖాతాకు జమవుతున్నాయని తెలిపారు జెసి టి.నిషాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ లో అత్యంత ముఖ్యమైనటువంటి గోనే సంచులు, హమాలీ కార్మికులు, ధాన్యం రవాణా విషయంలో ఆరుగాలం శ్రమించి పండించిన రైతాంగానికి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పౌర సరఫరాల శాఖ నిరంతరాయంగా రేయింబవళ్లు రైతులకు అండగా ఉంటూ సత్వర సేవలు అందిస్తున్నాని అన్నారు. రైతులు కూడా తాము పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుని మంచి గిట్టు బాటు ధరలు పొంది వ్యవసా యాన్ని లాభ సాటిగా మార్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు.


కుందూరులో వివరాలు తెలుసుకుంటున్న జెసి

ధాన్యం కొనుగోలు పరిశీలన

రామచంద్రపురం: కె.గంగవరం మండలంలోని కుందూరులో జరుగుతున్న దాన్యం కొనుగోలు జిల్లా జెసి టి.నిషాంతి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లో సిబ్బంది పని తీరు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమం లో రెవెన్యూ డివిజనల్ అధికారి దేవరపల్లి అఖిల, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు రంగారావు, మండల వ్యవసాయధికారి బి.రవి పాల్గొన్నారు.

విలసవిల్లిలో వ్యవసాయ పనిముట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విలసవిల్లిలో పిఎం అనుసూచిత జాతి అభ్యుదయ యోజన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు శుక్రవారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఒక్కొక్క రైతుకు రెండు టార్పాలిన్‌లు, నీటి డ్రమ్ములను సర్పంచ్ ఊర్మిళదేవి అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్,యు. మల్లికార్జునరావు,గుండుమోగుల రామకృష్ణ,బీర శాంత కుమారి, కొల్లి లోకేష్,వజ్రపు లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.


టార్పాలిన్‌లు అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాల్లో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

రామచంద్రపురం: గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో గల శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై వివిధ పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయాల్లోని ని నిక్షేప్తమైన గ్రంథాలను, లైబ్రేరియన్ దడాల వెంకటరమణ విద్యార్థులకు పరిచయం చేశారు. చరిత్రకు సంబంధించిన గ్రంథాలను, సైన్స్ పుస్తకాలను, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను, విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సద స్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పివి.సూర్యరావు, గోవిందరాజు, విఆర్ఒ రాజారావు, ఉపాధ్యాయులు ఉమాదేవి, మందనక్క రాజేంద్ర, అసిస్టెంట్ లైబ్రేరియన్ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** స్థానిక శాఖా గ్రంథాలయం లో గ్రంథాలయ పాలకురాలు డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కపిలేశ్వరపురం సోషల్ వెల్ఫేర్ ఎస్ సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, ఉపాధ్యాయురాలు సురేఖ, పాలకరాలు శివకుమారి,పాఠకులు ,విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు. **అల్లవరం:** స్థానిక తతీయ శ్రేణి శాఖగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి వి.ద్వారకామణి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్ రావు మాట్లాడారు. **ఉప్పలగుప్తం.** విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవర్చుకోవాలని హెచ్ఎం,నూకల సత్యనారాయణ కోరారు భీమనపల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషు కుమార్ అధ్యక్షతన విద్యార్థులు పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ న్యాయవాది అద్దంకి అమరేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


సూర్యప్రకాష్‌ను ఆహ్వానిస్తున్న బిసి సంఘ నేతలు

శెట్టిబలిజ వన సమారాధనకు సూర్యప్రకాష్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈనెల 23వ తేదీన జరిగే నియోజకవర్గం శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ వనసమారాధనలకు వైసిపి ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ను సంఘ నాయకులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ వన సమారాధనకు వచ్చే ప్రజలందరికీ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఎవరికీ ఏ విధమైన సౌకర్యం కలగకుండా చూడాలని, మంచి విందు భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనను ఆహ్వానించిన వారిలో వన సమారాధన కమిటీ కన్వీనర్ కట్ట సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు రాయుడు చంద్రావు, మాజీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పట్టణ నాయకులు దంగేటి భద్రరావు గొబ్బల లక్ష్మి గణపతి రావు, రూరల్ నాయకులు వెంకీ వీర రాఘవులు గేసాల గోపి, కే గంగవరం మండలం నాయకులు పంపన సుబ్బారావు, కొప్పిశెట్టి లక్ష్మణ్, కాజులూరు మండలం నుండి పిల్లి కష్ణమూర్తి, అరణ్ కుమార్, భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ డిజిటల్ అసిస్టెంట్లు చురుకైన పాత్ర పోషిస్తూ నిరంతరం కృషి చేయాలని ఎంపిడిఒ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఆయన సాంబార్లో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ రాజును వారంతా అభినందించి సత్కరించారు. ఈసందర్భంగా ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి పనుల్లో డిజిటల్ అసిస్టెంట్ల ముద్ర ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని సంబంధిత లబ్ధిదారులకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. మండలంలోని ఆలమూరు-1, కలవచర్ల గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్నందున సమీప గ్రామ సచివాలయ సిబ్బంది ఆబాధ్యతలు తీసుకుని ఆయా గ్రామాల ప్రజలకు సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు పట్టాభి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రమశిక్షణ కమిటీ సభ్యుల పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు ఎన్టీఆర్ వైద్య సేవ క్రమశిక్షణ కమిటీ సభ్యుల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో గత ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ త్రైమాసికం లో ఎన్‌టిఆర్ వైద్య సేవలకు సంబంధించి 14 ఫిర్యాదులు అందినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ 14 ఫిర్యాదులపై ఆసుపత్రుల ద్వారా విచారించి, ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం వర్తించినప్పటికీ ఆసుపత్రి యజమాన్యాలు బిల్లుల రూపంలో నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుండి నిధులు స్వీకరించారన్నారు. ఆ యొక్క నిధులను ట్రస్టు నుండి తిరిగి ఆసుపత్రు లకు చెల్లించి రోగులు చెల్లించిన బిల్లుల సొమ్మును ఆసుపత్రి నుంచి తిరిగి రోగులకు ఇప్పించామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుండి ఆసుపత్రి యజమాన్యాలు బిల్లుల రూపంలో నిధులు చెల్లిం చమనడం పై స్పందించిన జిల్లా క్రమశిక్షణ కమిటీ సభ్యులు ప్రాథమిక తప్పుగా భావించి ఎటువంటి జరిమానాలు ఆయా ఆసుప త్రులకు విధించడం లేదని భవిష్యత్తులో ఇటు వంటి చర్యలకు పాల్పడిన నెట్వర్క్ ఆసు పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆరోగ్య బీమా పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల ఆరోగ్య భద్రతా, ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక పోకస్ పెట్టాలని సభ్యులకు సూచించారు ప్రభుత్వ ఆసుపత్రులు మరియు నెట్‌వర్క్ ఆసుపత్రులు, నిరక్షరాస్యులైన రోగులకు సౌకర్యాలు కల్పించడానికి వైద్య మిత్రలచే నిర్వహించబడే హెల్ప్ డెస్కులు సహాయంతో నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా పొందాలన్నారు పేద కుటుంబాలకు యూనివ ర్సల్ హెల్త్ కవరేజీని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు ట్రస్ట్ ద్వారా గుర్తించబడిన వ్యాధుల కోసం పూర్తి గా నగదు రహిత సేవల ను యూనివర్సల్ గా పొందాల న్నారు. లబ్ధిదారులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత స్క్రీనింగ్ మరియు ఔట్ పేషెంట్ కన్సల్టేషన్ ద్వారా ప్రాథమిక సంరక్షణలో ప్రయోజనం పొందే విధం గా పథకం రూపొందించ బడిందన్నారు. కార్య క్రమంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్ జిల్లా ఎన్‌టిఆర్ వైద్య సేవల సమన్వయ అధికారి రాధాకష్ణ, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్‌వి.భరత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

నిరుద్యోగ యువత, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు, మహిళలు, వికలాంగులు, బలహీన వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రా మిక వేత్తలు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపన ద్వారా ఒక ఆచరణీయ వత్తిగా ఎంచుకునేందుకు అన్ని విధాలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ డివిజన్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల కేంద్రం ఉన్న తాధికారులు మరియు గనులు భూగర్భ శాఖ గ్రామీణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా శశిభూషణ్ కుమార్ అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎం ఎస్ ఎం ఈ ద్వారా క్లస్టర్ స్థాయి లోపరిశ్రమల ఏర్పాటు సర్వే, ఉచిత ఇసుక నిర్వహణ, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ లు, వ్యాపారాల స్థాపన, ఆర్థిక వద్ధిని వేగవంతం చేస్తూ క్షేత్రస్థాయిలో సజనాత్మ కతను పెంపొందించడం తోపాటు నిరుద్యోగాన్ని పరిష్కరించే వ్యూహాత్మక విధానాన్ని ఎం ఎస్ ఎం. ఇ. లు ప్రతిబింబిస్తాయన్నారు. జిల్లాలలో ఉచిత ఇసుక విధానం అమలు తీరుపై ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 12 రీచ్ లు ఉండగా ఏడు రీచ్ లలో ఇంకా గోదావరి నీటి ప్రవాహం ఉన్నందున ఈ నెల 18వ తేదీ నుండి ఐదు పెద్ద రీచులలో ఇసుక తవ్వకాలు ప్రారం భిస్తామన్నారు.న కార్యక్రమంలో జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఎల్. వంశీధర్ రెడ్డి, కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్ డి ఎల్ డిఒ త్రినాథ్ రియాల్టీ ఇన్స్పెక్టర్ టి సుజాత జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆ ర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సొసైటీ ఉద్యోగి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-కోటనందూరు

అప్పలరాజుపేటకు చెందిన బంగారు వీర వెంకట సత్యనారాయణ వ్యవసాయ పరపతి సహకార కోపరేటివ్ సొసైటీలో పని చేస్తున్నారు. ఈ నెల 12 రోజువారీలాగే ఇంటి నుంచి బైకుపై బయటకు వెళ్లారు. ఆ రోజు నుంచీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, భార్య, బంధువులు స్నేహితులు వారి ప్రాంతాల్లో వెతికినప్పటికీ కనిపించ లేదు. దీంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన భార్య ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

జె.తిమ్మాపురం, గుడివాడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో శుక్రవారం స్థానిక సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురికి జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ముగ్గురికి రూ.10 వేల చొప్పున 30 వేల జరిమానా విధించగా ఒకరికి 3 రోజుల జైలు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పెద్దాపురం కోర్టు విధించినట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-జగ్గంపేట

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జగ్గంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేటకు చెందిన చోడసాని వెంకట రామస్వామి (35) తన వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో పుష్కరకాలవ వద్ద వెనకనుంచి లారీ ఢీకొంది. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు.


సత్యనారాయణను పరామర్శిస్తున్న సందీప్ తదితరులు

టిడిపి గ్రామ అధ్యక్షుడిని పరామర్శించిన బండారు సందీప్

ప్రజాశక్తి - కొత్తపేట

చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి గ్రామ అధ్యక్షులు గుబ్బల సత్యనారాయణను బండారు సందీప్ శుక్రవారం పరామర్శించారు. కొత్తపేట మండలం ఖండ్రిగ టిడిపి గ్రామ అధ్యక్షులు గుబ్బల సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవల కాకినాడ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అనంతరం పి.గన్నవరం మండలం కారుపల్లిలో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎంఎల్ఎ సత్యానందరావు తనయుడు బండారు సందీప్ పరామర్శించారు. ఆయన వెంట కంఠంశెట్టి శ్రీనివాస్ గారు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు గారు తదితరులు పాల్గొన్నారు.

గుంజీలు తీయడంతో విద్యార్థికి అస్వస్థత

ప్రజాశక్తి - కాట్రేనికోన

తప్పు చేశావని విద్యార్థిని ఒక టీచర్ గుంజీలు తీయించడంతో శుక్రవారం ఆ విద్యార్థిక ఆసుపత్రి పాలయ్యాడు. వివరాలు ఇవి.. లక్ష్మీవాడ జెడ్‌పి హైస్కూల్లో మడికి రవితేజ 9వ తరగతి చదువుతున్నాడు. అయితే విద్యార్థి రవితేజ తన పాఠ్య పుస్తకాలకు జిగురు అంటించుకుంటూ ఉంటే పక్క విద్యార్థికి జిగురు అంటుకుంది. దీంతో ఈ విషయంపై ఆ క్లాస్ లో ఉన్న టీచర్ రవితేజను పిలిచి నువ్వు తప్పు చేసినందుకు గాను నూట పది గుంజీలు తీయాలని చెప్పింది. దీంతో విద్యార్థి అతి కష్టం మీద గుంజీలు తీశాడు. టీచర్ నేను వంద గుంజీలు తీసాను ఇంక తియ్యలేను కాళ్లు లాగుతున్నాయి విద్యార్థి తెలిపాడు. అయినా నీకు కాళ్లు ఇంకా బాగా లాగాలి.. నీకు బుద్ధి రావాలి మళ్ళీ తియ్యి అని చెప్పి వంద గుంజీలు తీయించడంతో విద్యార్థి మడికి రవితేజ రెండు కాళ్ళు వాశాయి. చికిత్స నిమిత్తం విద్యార్థి రవితేజ ను తండ్రి నాగబాబు కాట్రేనికోన పిహెచ్‌సిలో మెరుగైన చికిత్స కోసం అడ్మిట్ చేశారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేశవశెట్టి

జిల్లా కౌలు రైతు సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- సఖినేటిపల్లి

సఖినేటిపల్లి లోజరిగే జిల్లాస్థాయి కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన కేశవశెట్టి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గొంది గ్రామంలో జరిగిన కౌలు రైతుల మండల సమావేశంలో ఆయన పాల్గొని కౌలు రైతు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కేశవశెట్టి డిమాండ్ చేశారు.


విద్యాబాల మందిర్‌లో నెహ్రూ జయంతి

ఘనంగా నెహ్రూ జయంతి

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట విద్యా బాల మందిర్ జవహర్ లాల్ నెహ్రూ 135 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అనురాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

బాధ్యత కలిగిన రాజకీయ నాయకునిగా, ఒక ఎంఎల్ఎ గా ప్రజా సమస్యల పట్ల వైఎస్.జగన్ స్పందించాలని టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి దండంగి మమత పేర్కొన్నారు. శుక్రవారం చింతలూరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమేన్నారు. గత నాలు గు రోజులుగా జరిగిన అసెంబ్లీ సమావేశాలను చూసిన వారికి, గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాలను చూసిన వారికి కూటమి ప్రభుత్వం ఏ విధంగా అసెంబ్లీ నడుపుతున్నదో అర్థమవుతుందన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవతి

ప్రజాశక్తి- మండపేట


గడి సత్యవతి

ఎపి తూర్పు కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ గడి సత్యవతి నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల రెండో జాబితాలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవతికి చోటు దక్కింది. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, నాయకులు సిరంగు ఈశ్వరరావు, గుండు తాతరాజు, చింతలపూడి సత్తిబాబు, వాదా ప్రసాదరావు, చింతల శ్రీనివాస్, సాధనాల చక్రపాణి తదితరులు సత్యవతికి అభినందనలు తెలిపారు.

డిఎస్‌పికి సమస్యల వినతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం డిఎస్‌పి. టియస్ఆర్ ప్రసాద్‌ను అమలాపురం మండల సర్పంచ్ లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను డిఎస్‌పికి విన్నవించారు. గ్రామాల్లో సర్పంచ్‌లే ప్రథమ పౌరులని, గ్రామాల్లో మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, దొంగతనాలు, లా అండ్ ఆర్డర్ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని డిఎస్‌పికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, కరాటం ప్రసన్న ప్రవీణ్, పెనుమాల సునీత, గంగుమళ్ళ ఏసుబాబు, పందిరి విజయ, గుత్తుల చిరంజీవి, పెద్దిరెడ్డి రాము, శ్రీవెంకటేశ్వరా కళాశాల ప్రిన్సిపల్ కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న ఆదర్శ ఆంధ్ర యూత్ కువైట్ సామాజిక సేవా సంఘం సభ్యులు

ప్రజాశక్తి - మలికిపురం

రెండు కుటుంబాలకు ఆదర్శ ఆంధ్ర యూత్ కువైట్ సామాజిక సేవా సంఘ సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆదర్శ ఆంధ్ర యూత్ కువైట్ సామాజిక సేవా సంఘం సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ స్వామి మోకా ఇంజేటి కష్ణకుమార్, అధ్యక్షులు ఇంజేటి శ్యామ్ బాబు , కార్యదర్శి గెడ్డం రామారావు ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన నల్లి రాజమణి, రాజేశ్వరరావు కుటుబానికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ .10 వేలు, నల్లి మరియమ్మ, మల్లేశ్వర రావు కుటుంబానికి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున రూ.10వేలే ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బత్తుల రాము, జి. తులసి భాస్కరరావు, జివివి. సత్యనారాయణ, దొండపాటి రాంబాబు, తాడి సహదేవ్, నల్లి ఆనందరావు, చెవ్వాకుల సుందరావు, కారుపల్లి సాంబమూర్తి, కారుపల్లి ఏసురత్నం,కారుపల్లి సాంబశివరావు (సుప్రియ టైలర్), కారుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జిపిడిపి, బిపిడిపి'లపై అవగాహన

ప్రజాశక్తి - పి.గన్నవరం

ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్(జిపిడిపి) బ్లాక్ డెవలప్మెంట్ పంచాయతీ ప్లాన్(బిపిడిపి)లపై సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కె.వి.ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు, పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్, బ్లాక్ డెవలప్మెంట్ ప్లాన్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై నుంచి కింద స్థాయి వరకూ ఉన్న ప్రణాళికలను ఎవరైనా అవలంబించకపోతే వారు నిధులు ఖర్చు చేసుకునే అవకాశం కోల్పోతారన్నారు.పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల సచివాలయ సిబ్బంది మరియు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జివి.సరోవరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట డివిజనల్ డెవలప్మెంట్ అధికారి టి.రాజేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతి డెవలప్ మెంట్ ప్లాన్ బ్లాక్, పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు. **మలికిపురం:** పంచాయతీ నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని మలికిపురం ఎంపిడి ఎస్.బాలాజీ అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివద్ధి ప్రణాళిక 2025-26 సంవత్సరానికి ప్రాణాళికలు తయారుచేసేందుకు అన్ని గ్రామ పంచాయితీల కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, పంచాయతీ కంప్యూటరు ఆపరేటర్లకు, వెలుగు గ్రామ ఐక్య సంఘాల ప్రతినిధులకు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.బాలాజీ శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా ఎంపిడిఒ, టిఒటీలుగా ఇఒపిఆర్‌డి జి.మల్లికార్జున రావు, ఎఒ జి.మిల్టన్, పంచాయతీల కార్యదర్శులకు జి.శంకర్, కె. వేంకటేశ్వరరావు వ్యవహరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పి.గన్నవరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సహకార సంఘాల వారోత్సవాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సొసైటీల కంప్యూటరీకరణతో బ్యాంకింగ్ రంగంలా సహకార సంఘాలు కూడా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తాయని జిల్లా సహకార స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్టర్ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. అఖిల భారత సహకార సంఘాల 71వ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ముమ్మిడివరం ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయంలో సహకార సంఘాల నూతన ఆవిష్కరణలు, సాంకేతికత మరియు సుపరిపాలన అనే అంశంపై డివిజనల్ సహకార అధికారి ఎ.రాధాకష్ణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కంప్యూటరీ కరణ వలన సంఘాలు పారదర్శకంగా పనిచేస్తాయని అన్నారు. సభ్యులను చైతన్యపరిచి వారోత్సవ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యమ చరిత్ర, వారోత్సవాల ప్రాముఖ్యతను సభ్యులకు వివరించారు. అనంతరం సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటనారాయణ, రైతు సేవా కేంద్రం ఎఇఒ కృష్ణయ్య, సొసైటీ సిఇఒ మట్టపర్తి జయరాం లతోపాటు పలువురు పాల్గొన్నారు.

కోటిపల్లి రేవులో ప్రయాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఐదు నెలలుగా మూసివేసిన కోటిపల్లి రేవును శుక్రవారం తిరిగి ప్రారంభించారు. కె. గంగవరం మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న రేవును గోదావరి వరదల కారణంగా జూలై నెల నుండి మూసివేశారు. వరదలు తగ్గిన నేపథ్యంలో నెలసరి అద్దె ప్రాతిపదికన రేవును కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ ఏడాది కోటిపల్లి రేవ బహిరంగ వేలానికి పాటదారులు ఎవరు వేలానికి హాజరు కాకపోవడంతో బహిరంగ వేలం నిలిచిపోయింది. దీంతో బహిరంగబలం జరిగే వరకూ నెలసరి అద్దె రూ.7 లక్షల 36 వేలకు కాంట్రాక్టర్ అప్పగించారు. గంగవరం ఎంపిడిఒ నందమూరి శ్రీనివాస్ మార్చి వరకు అద్దె ప్రాతిపదికన రేవును నిర్వహించి, అనంతరం జిల్లా అధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహిస్తామని విలేకరులకు వివరించారు.

సిసి రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం క్రింద మంజూరైన రూ.2.47 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఎపిఒ జి.అరుణకుమారి, మండల ఇంజనీరింగ్ జెఇ డి,వీరభద్రరావు అన్నారు. మండలంలోని ఇప్పటికే పూర్తయ్యిన పినపళ్ల, పెనికేరు, మూలస్థాన అగ్రహారం, సంధిపూడి గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కొలతలు నమోదు చేసుకున్నారు. తొలివిడతగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ నుంచి పది గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయిన్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ నాలుగు గ్రామాల్లో పనులు పూర్తికాగా ఏడు గ్రామాల్లోని పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. రెండవ విడతలో మంజూరయ్యే ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో మిగిలిన ఎనిమిది గ్రామాల్లో పనులు చేపట్టనున్నట్లు ఎపిఒ అరుణకుమారి పేర్కొన్నారు.